

ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం : జెసి

కడప : ప్రతి సోమవారము 'స్పందన' కార్యక్రమంతో పాటు మండల స్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జెసి జి.గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచిస్తూ అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు కార్యక్రమంలో సిపిఒ వెంకటరావు, డిఆర్‌డిఎ పిడి ఆనంద్ నాయక్, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ పిడి కృష్ణయ్య, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వెంకట సుబ్బయ్య, బిసి సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మయ్య, డిఎంహెచ్ఒ డా. నాగరాజు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్‌ రమాదేవి, ఎల్డిఎం దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రాణాలర్పించైనా ఒపిఎస్‌ను సాధిస్తాం

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలవుతున్న సిపిఎస్, జిపిఎస్ పెన్షన్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు అలుపెరుగని సమరశీల పోరాటాలు కొనసాగిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. సోమవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోను లేని సిపిఎస్ విధానాన్ని ఆనాటి ముఖ్యమంత్రిగా ఉన్న వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి మన రాష్ట్రంలో అమలు పరచి ఉద్యోగ, ఉపాధ్యాయుల వెన్నువిరిచారని, ఆ దుర్మార్గపూరితమైన సిపిఎస్ విధానాన్ని రద్దు చేయించుకోవడానికి నాటి నుంచి నేటి వరకు అలుపెరుగని పోరాటాలు కొనసాగిస్తున్నామని వాపోయారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేత హోదాలో తాను నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర సందర్భంగా అడుగడుగునా తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చి నేడు మాట తప్పి మడమ తిప్పి సిపిఎస్ కన్నా ఘోరమైన జిపిఎస్ అనే మరో పెను అభద్రతా పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. దేశంలోకెల్లా ఆదర్శవంతమైన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లుగా చెప్పడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమేనని పేర్కొన్నారు. పూర్వప్పుడులో అందరూ ఉండే పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తండ్రి చేసిన తప్పును కుమారుడు సవరిస్తాడని కోటి ఆశలతో అధికారంలోకి రావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ఉద్యోగ, ఉపాధ్యాయులను ఈ ముఖ్యమంత్రి వంచించడం మంచిది కాదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 18 న రాష్ట్ర నాయకత్వం విజయవాడలోని యుటిఎఫ్ కార్యాలయం లో ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటుందని చెప్పారు. 19న కడప యుటిఎఫ్ భవన్‌లో జిల్లా ప్రధాన నాయకత్వం నిరవధిక నిరాహార దీక్షలకు సిద్ధమవుతున్నట్లుగా తెలిపారు. ఆమరణ నిరాహార దీక్షలు విజయవంతం చేయడానికి జిల్లాలోని భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు మజ్జారి, చెన్నకేశవులు, కిరణ్ బాబు, కరీముల్లా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి- కడప అర్బన్

కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్‌చంద్ మార్నింగ్ విజిట్‌లో భాగంగా సోమవారం పుట్లంపల్లి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, వినాయక నగర్ ప్రాంతాలను ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగా అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంసిసి పుట్లంపల్లి ప్రాంతాన్ని పరిశీలిస్తూ కంపోస్ట్ ఎరువు తయారుచేసేటువంటి తొట్ల కొలతలను పరిశీలించి వాటిని పలు మార్పులు చేయవలసినదిగా అధికారులకు సూచించారు. అక్కడి నుంచి వచ్చే నీటి కోసం డ్రెయినేజీ పనులను ప్రారంభించవలసినదిగా అధికారులకు ఆదేశించారు. పుట్లంపల్లి గార్బేజ్ ట్రాన్స్‌పోర్టు స్టేషన్‌లో మొక్కలను నాటించే విధంగా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ విభాగ అధికారులకు ఆదేశించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్దన ఏర్పాటు చేస్తున్నటువంటి ఎంఆర్‌ఎఫ్ షెడ్యూల్ పనులను పరిశీలిస్తూ పనులను వెంటనే వేగవంతంగా పూర్తి చేయు విధంగా చర్యలు తీసుకోవాలని అవసరమగు సామగ్రిని, మెటీరియల్స్ ముందుగా సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వినాయక నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్నటువంటి గార్బేజ్ ట్రాన్స్ఫర్ పాయింట్ ను పరిశీలిస్తూ సివిల్ వర్క్స్ లను వెంటనే పూర్తి చేయు విధంగా చర్యలు తీసుకోవాలని వాటికి కేటాయించిన సమయానికి పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగా అధికారులకు ఆదేశించారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

దూసుకెళ్తున్న కర్నూలు జట్టు

ప్రజాశక్తి - కడప

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఎం. మహేంద్ర యాదవ్ డబల్ సెంచరీ, జి. మనోజ్ రాజు సెంచరీలు చేయడంతో కర్నూలు జట్టు 424 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఒక వికెట్ నష్టానికి 26 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 101.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 424 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ చెట్టులోని ఎం మహేంద్ర యాదవ్ 246 బంతులను ఎదుర్కొని 24 బౌండరీలు, 8 సిక్సర్ల సహాయంతో 201 పరుగులు (డబల్ సెంచరీ) చేశాడు. మరో బ్యాట్స్మెన్ జి. మనోజ్ రాజు 16 ఫౌండరీలు సహాయంతో 146 పరుగులు (సెంచరీ)చేశాడు. అనంతపురం జట్టులోని ఎస్ఎండి. కామిల్ 3 వికెట్లు తీసుకున్నాడు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం : పిఒ

కడప సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరంలాంటిదనీ జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తుమ్మలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఆలోచలతోనే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు.. ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలనే ఆలోచనలో భాగంగానే, చేపట్టారన్నారు. దీని ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని పేదల ఇంటి ముందుకే తీసుకొచ్చారన్నారు.ఇందులోబాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించామన్నారు మహిళలకు సంబంధించి గైనకాలజిస్టులు, ఆర్థోపెడిక్ డాక్టర్లు, చిన్నపిల్లల నిపుణులు, ఉన్నారని, అలాగే కంటికి సంబంధించి, ఇతర ఐదు మంది డాక్టర్లు కూడా ఉన్నారన్నారు. ఈ శిబిరంలో వారి వారికి సంబంధించిన 11 రకాల పరీక్షలను కూడా వారికి నిర్వహి స్తారని అన్నారు. అవసరాన్ని బట్టి వారికి అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహించి వారికి తగు వైద్యం అందిస్తూ ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమం ఎంతో బృహత్తరమైన కార్యక్రమమని అన్నారు. అవకాశాన్ని ప్రజలం దరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగ న్మోహన్ రెడ్డి, తహశీల్దార్ భాస్కర్ రాజు,స్థానిక సర్పంచ్ నాగ మల్లేష్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్..పశ్చిమగోదావరి

ప్రజాశక్తి-కడప

మూడు రోజులుగా జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు సోమవారం ముగిసాయి. రాష్ట్రస్థాయి పోటీలలో సీనియర్ మహిళల విభాగంలో విజేతగా వెస్ట్ గోదావరి జట్టు నిలిచింది. బాలుర విభాగంలో కూడా విజేతగా వెస్ట్ గోదావరి జట్టు నిలిచింది. మహిళల విభాగంలో రెండవ స్థానంలో కృష్ణ జట్టు, మూడవ స్థానంలో కడప, విజయనగరం జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో రెండవ స్థానంలో చిత్తూరు జట్టు, మూడవ స్థానంలో విజయనగరం జట్టు నిలిచాయి. సీనియర్ మహిళల విభాగంలో కడప మహిళల జట్టు మూడవ స్థానంలో నిలిచింది. సీనియర్ మహిళల విభాగంలో బెస్ట్ ప్లేయర్ గా కడప జట్టుకు చెందిన పల్లవి నిలిచింది. సాయంత్రం నిర్వహించిన ముగింపు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్ సూర్యనారాయణ, టోర్నమెంట్ స్పాన్సర్స్ కంచి గోపికృష్ణ, కంచి సురేంద్ర, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కె. చిన్నపరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వి. శివప్రసాద్ లు విజేత జట్లకు కప్పు, ట్రోఫీలను బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సింధూరి, ఉపాధ్యక్షులు వెంకట సునీల్, కోశాధికారి బాబర్, జాయింట్ సెక్రటరీ బసిరెడ్డి, కిషోర్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, కోచ్ లు, మేనేజర్లు, అబ్జర్వర్లు పాల్గొన్నారు.



అతిథుల నుంచి ట్రోఫీని అందుకుంటున్న పశ్చిమ గోదావరి జట్టు



మాట్లాడతున్న ఎస్‌టియు నాయకులు

జిపిఎస్‌ను బలవంతంగా రుద్దడం తగదు

ప్రజాశక్తి- చాపాడు

జీవితకాలం పాటు ప్రజలకు, ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాలకు భద్రత కల్పించేలా,ఇచ్చిన హామీ మేరకు ఓపిఎస్ ను అమలు చేయాల్సిందేనని, జిపిఎస్‌ను బలవంతంగా రుద్దితే మరో ఉద్యమం తప్పదని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రమణారెడ్డి, వై.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. మైదుకూరు ఎంఆర్‌సి ఆవరణలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అనిదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చెబుతున్నప్పటికీ పాలకులు పెడచెవిన పెట్టడం అన్యాయమన్నారు. పెన్షన్ అనేది భిక్ష కాదు ఉద్యోగుల హక్కు అన్నారు 62 ఏళ్ల వయసులో విరమణ చెందిన ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ లేకపోతే తన కుటుంబాన్ని ఎలా పోషిస్తాడో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కూలీ పని చేసుకుందామనుకున్నా ఆవయసులో పని ఇచ్చేవారు కూడా దొరకరన్నారు. కుటుంబాలతో సహా నడిరోడ్డున పడాల్సిన దుస్థితి దాపురిస్తుందన్నారు. దసరాకు డిఎ కానుక అని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చెప్పిన మాటలు అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. సమావేశంలో రీజనల్ కన్వీనర్ బి.కె.సురేష్, సీనియర్ నాయకులు బి.సుబ్బారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎన్.శివారెడ్డి,ఆర్థిక కార్యదర్శి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కృపా కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కడప

కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని సోమవారం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏర్పాటుచేసిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్‌కు స్థానిక న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్ విన్నవించారు. పాస్టర్ పి.మహేష్ కమిషనర్ కు తెలియపరుస్తూ బుడగజంగాల కాలనీ వెనక భాగంలో ఉన్న కృపా కాలనీ గతంలో పైభాగం నుంచి వచ్చే డ్రెయినేజీ, మురుగునీటి కుంటలతో నిండి ఉండేదని చెప్పారు. స్థానికుల సాయంతో కుంటులను పూడ్చివేశామన్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. తక్షణమే స్పందించిన కమిషనర్ డిఇకి, సంబంధిత అధికారులకు కృపా కాలనీని అభివృద్ధి చేయనడాకిఇకృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానికులు సిస్టర్ శాంతమ్మ, పి.రవితేజ కృపా కాలనీ వాసులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు సమస్యను విన్నవిస్తున్న మహేష్

పుల్లయ్యను కలిసిన కార్మిక నాయకులు

కడప : నూతనంగా కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన చెప్పలి పుల్లయ్యను కడప నగరంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం ప్రొద్దుటూరు అసెంబ్లీ నాయకులు కలిశారు. రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలుపుతూ, శాలువా, మరియు పూలమాలవేసి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన జిల్లాకు చెందిన వ్యక్తి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు అసెంబ్లీ కార్మిక నాయకులు ఎల్లయ్య, ఖాదర్బాషా, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-440 పనులకు మోక్షమేదీ?

ఎన్‌హెచ్-440 రహదారి నిర్మాణ పనుల్లో కదలిక కనిపించడంలేదు. ఏడాదిన్నర కిందట ఎస్‌ఆర్‌కె కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టు సంస్థ అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి నుంచి కడప జిల్లాలోని వేంపల్లి మండలం గండి వరకు 51 కిలోమీటర్ల మేర రెండు లేన్ల రహదారి నిర్మాణ పనుల కాంట్రాక్టును దక్కించుకుంది. ప్రారంభ దశలో 25 శాతం మేరకు నిర్మాణ పనుల్ని చేపట్టింది. మూడు నెలల అనంతరం జాతీయ రహదారి నిర్మాణ పనుల్ని వదిలేసింది. దీనిపై ఎన్‌హెచ్ ఇంజినీరింగ్ యంత్రాంగం పలుమార్లు ప్రయత్నిం చినప్పటికీ అందుబాటులోకి రాకపోవడంతో టెర్మినేషన్ నోటీసులు జారీ చేసే ప్రయత్నాల్లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

- ఏడాదిన్నర నుంచి 25 శాతం పనులే
- 9 నెలలుగా అందుబాటులో లేని గుత్తేదారు
- టెర్మినేషన్ నోటీసులతో ఎన్‌హెచ్ యంత్రాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎన్‌హెచ్-440 రెండు లేన్ల రహదారి నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. 2022 మేలో ఎన్‌హెచ్ ఇంజినీరింగ్ యంత్రాంగం నిర్వహించిన రూ.270 కోట్ల టెండరును కర్నాటకకు చెందిన ఎస్‌ఆర్‌కె కాంట్రాక్టు సంస్థ దక్కించుకుంది. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి నుంచి కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండలం గండి క్షేత్రం వరకు 51 కిలోమీటర్ల రెండు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టు పనుల్ని చేపట్టాల్సి ఉంది. ప్రారంభ సమయంలో కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండల కేంద్రానికి సమీపంలోని గండి క్షేత్రం నుంచి చక్రాయపేట మండలంలోని సురభి గ్రామం వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర రూ.50 కోట్ల విలువ కలిగిన పనుల్ని చేపట్టింది. 25 శాతం పనుల్ని వేగవంతంగా చేపట్టింది. తొమ్మిది నెలల కిందట కాంట్రాక్టర్ మృతి చెందడంతో కాంట్రాక్టు సంస్థ నిర్మాణ పనుల్ని గాలికొదిలేసింది. 2022 మే నుంచి నేటి వరకు సుమారు 17 నెలల వ్యవధిలో 50 శాతం పనుల్ని పూర్తి చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అంగుళం కూడా కదలని నేపథ్యం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. దీనిపై ఎన్‌హెచ్ ఇంజినీరింగ్ యంత్రాంగం పలుమార్లు ఫోన్ ద్వారా కలిసేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. తొమ్మిది నెలలుగా గుత్తేదారు సంస్థ నుంచి ఎటువంటి స్పందన కనిపించడం లేదు. ఎన్‌హెచ్ ఇంజినీరింగ్ యంత్రాంగం టెర్మినేషన్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. దీనిపై గుత్తేదారు స్పందించకపోతే కాంట్రాక్టును రద్దు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గుత్తేదారులో కదలిక వస్తే జాతీయ రహదారి నిర్మాణ పనుల్ని వేగవంతంగా పూర్తి చేయడమా, లేనిపక్షంలో ఉపగుత్తేదారుకు కాంట్రాక్టును అప్పగించి పనులు పూర్తి చేయించడమా అనే ప్రత్యామ్నాయ ఆలోచనల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా 2024 మే నాటికి జాతీయ రహదారి పనుల్ని పూర్తి చేయడం సందేహాలకు తావిస్తోంది. దీనిపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయభాస్కర్‌రెడ్డిని సంప్రదించగా టెర్మినేషన్ నోటీసులు జారీ చేసే ఆలోచనల్లో ఉన్న మాట వాస్తవమేనని తెలిపారు. నిర్దేశిత గడువులోపు రాయచోటి-వేంపల్లి జాతీయ రహదారి పనుల్ని పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగు తున్నామని పేర్కొన్నారు.



వేంపల్లి-చక్రాయపేట మధ్య ఆగిపోయిన రోడ్డు పనులు



ఎపిఒను సన్మానిస్తున్న ఎపిడి, ఎంపిడిఒ, ఉపాధి సిబ్బంది

ఉపాధి ఎపిఒకు సన్మానం

ప్రజాశక్తి - వల్లూరు

ఉపాధి కార్యాలయంలో ఎపిఒగా విధులు నిర్వహిస్తున్న పార్థసారథి బదిలీపై విఎన్‌పల్లె మండలానికి వెళ్తున్నారు. స్థానిక ఉపాధి సిబ్బంది ఆయన్ను సోమవారం ఘనంగా సన్మానించారు. ఉపాధి సిబ్బంది సిఒలు, టిఎల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎపిఒ పార్థసారథి మాట్లాడుతూ విధి నిర్వహణలో తన అనుభూతిని ఉపాధి సిబ్బందితో పంచుకున్నారు. వాళ్ల సహకారంతోనే మండలంలోని ఉపాధి పనుల్లో అభివృద్ధి తీసుకొచ్చామన్నారు. ఈ సందర్భంగా ఏపీడీ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమే మడలంలో పార్థసారథి ఉపాధి సిబ్బంది అందరిని సమన్వయం చేసుకుంటూ మంచి ఫలితాలు రాబట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జుబేదా, ఇఒపిఆర్‌డి ప్రసాద్, ఎపిఒ సుధారాణి, ఇసి అన్నానాయక్, సిఇఒలు రామలింగారెడ్డి, లక్ష్మీనారాయణ, అరవింద్, టిఎలు రెడ్డయ్య, ఆంజనేయులు, ఎఫ్ఏలు, బాల ఓబయ్య ,మధు ,సునీల్ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

9 గంటల విద్యుత్ అందించకపోతే ఆందోళన తప్పదు

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ పగలు నిరాటంకంగా అందిస్తానని చెప్పి ఇప్పుడేమో 7 గంటలకు తగ్గించడమే కాకుండా కోతలు విధించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పీడిత ప్రాంతాలైన రాయలసీమ కేంద్ర కడప జిల్లాలో అత్యధిక వ్యవసాయ విద్యుత్తు మోటార్లు ఉన్నాయన్నారు. జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నప్పటికీ పంట కాలువల నిర్మాణం లేక ఆయకట్టుకు నీరు అందే వెసులుబాటు లేదన్నారు. అనివార్యంగా వ్యవసాయ మోటార్లపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతాంగానికి విద్యుత్ కోతలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాలలో ఇసుక మాఫియా దెబ్బకు భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయన్నారు. వరుసగా అతివృష్టి, అనావృష్టితో నష్టపోతున్న రైతాంగానికి చేసిన అప్పులు తీర్చలేక అవమానభారంతో ఆత్మహత్యల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ కోతలు రైతుల పాలిట శాపంగా మారే ప్రమాదం ఉండదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ కోతలకు స్వస్తి చెప్పి పగటిపూట 9గంటల విద్యుత్ విరాటంకంగా అందించకపోతే ఆందోళన తప్పదని వారు హెచ్చరించారు.

యువత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

కడప : యువత జీవితానికి సంబంధించి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని రాజంపేట ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి. శంకర్ అన్నారు. సోమవారం జిల్లా యువజన సర్వీసుల శాఖ(స్టెప్) ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత జీవితానికి సంబంధించి ఒక లక్ష్యాలని ఏర్పరచుకోవాలన్నారు. అందులో భాగంగా విద్యా, వైజ్ఞానిక, క్రీడలు, సాంస్కృతిక విషయాలలో సంబంధించి వారికి గల అభిరుచుకి అనుగుణంగా సమయ పాలన పాటిస్తూ, కఠోర దీక్షతో లక్ష్యాలని చేరుకోవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వీర సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ జనాభాలో ఏ దేశములో లేనటువంటి యువత మన భారత దేశములో 33 శాతం యువత ఉన్నారని అన్నారు. వారి ద్వారా దేశ భవిష్యత్తుకు ఉపయోగపడాలని, స్టెప్ కార్యాలయము వారు యువత కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంసంతోష దాయకమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల దాదాపు 250 మందితో విద్యార్థులతో పాటు కళాశాల సిబ్బంది, స్టెప్, మేనేజర్.వి. వి. సుబ్బరాయుడు, సిబ్బంది, జి.వి. సుబ్బారావు పాల్గొన్నారు.

కీలక నిర్ణయాలకు ఆమోదం

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అకడమిక్ సేనేట్ స్టాండింగ్ కమిటీతో విసి ఆచార్య చింతా సుధాకర్ తన ఛాంబర్‌లో సోమవారం భేటీ అయ్యారు. త్వరలో ప్రకటన వెలువడనున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్‌లో పోస్టుల రోస్టర్, స్పెషలైజేషన్, పోస్టులకు కావలసిన అర్హతలు చర్చించి సేనేట్ అనుమతితో ఆమోదం తెలిపారు. విశ్వవిద్యాలయం ఈ విద్యా సంవత్సరం నుంచి దూరవిద్య కోర్సులు అమలు చేసేందుకు సెనెట్ ఆమోదం తెలిపింది. ఎంబీఏ, ఎంసీఏ ల నిర్వహణకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో అకడమిక్ స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. నూతన విద్యా సంవత్సరం కోర్సులు, సిలబస్ అమలు తదితర అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాల అమలుకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో వైవీయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్. రఘునాథ్‌రెడ్డి, ప్రొద్దుటూరు వైయస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు, డిడిఇ సంచాలకులు ఆచార్య కె .కృష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి, డీన్‌లు, ఆచార్య ఏజీ దాము, ఆచార్య టి శ్రీనివాస్, ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి, ఆచార్య రమణయ్య, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సంచాలకులు ఆచార్య చంద్ర ఓబుల రెడ్డి, సిడిసి డీన్ రఘుబాబు, ఐక్యుఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యంశర్మ పాల్గొన్నారు.

చంద్రకిషోర్ కుటుంబాన్ని ఆదుకుంటాం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఉద్యోగి పసుపులేటి చంద్ర కిషోర్ కుటుంబాన్ని ఆదుకుంటామని విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. వై వీయూ లోని పరిపాలన భవనం ప్రాంగణంలో చంద్ర కిషోర్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి, పరిపాలకులు, బోధన, బోధనేతర సిబ్బంది నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఉద్యోగి అంటే విధుల్లో చంద్రకిశోర్ లా ఉండాలని తెలిపారు. అతని పనితీరు ఆదర్శమని కొనియాడారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య విజయ రాఘవ ప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి ,ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ చంద్ర కిషోర్ చిన్న వయసులోనే మనందరి నుంచి దూరం కావడం బాధాకరమన్నారు. విధుల్లో బాధ్యతగా ఉంటూ అందరి మనల్ని అందుకున్నారని గుర్తుకు తెచ్చారు. బోధ నేతల సిబ్బంది మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు బోధనేటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కడప సమగ్రాభివృద్ధిపై చర్చా వేదిక

ప్రజాశక్తి - కడప అర్బన్

జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం10 గంటలకు ప్రెస్‌క్లబ్‌లో జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వేదిక జాతీయ ఉపాధ్యక్షులు జి.విశ్వనాధ, రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ పి.శివారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత నిర్వహించే ఈ చర్చా వేదికలో మాజీ మంత్రి డి.ఎల్. రవీంద్రా రెడ్డి, పిసిసి చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డపగారి శ్రీనివాసులు రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగనపల్లి చంద్రశేఖర్, జనసేన పార్టీ కడప అసెంబ్లీ ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ బేరిల శ్రీనివాస్, లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు దేవర శ్రీ కృష్ణతో పాటు వివిధ ప్రజాసంఘాల, సంస్థల నేతలు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిని కాంక్షించే ప్రజాస్వామ్యవాదులందరూ చర్చావేదికలో పాల్గొని జిల్లా అభివృద్ధికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'స్పందన' ఫిర్యాదుల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైమ్ బారిన పడ్డ బాధితులు ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్ కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్ లైన్ వెబ్ సైట్ www.cyber-crime.gov.in ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) లో, టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయొచ్చని ప్రజలకు సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం లాంటిది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణ పరిధిలోని శ్రీనివాసనగర్-1 అర్బన్ హెల్త్ సెంటర్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పిల్లలకు, గర్భిణులకు ఇస్తున్న పోషకాహారంపై వివరించారు. డాక్టర్లు మాట్లాడుతూ ఇలాంటి మంచి అవకాశాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ సూపర్వైజర్ శాంతకుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం ద్వారా ఇస్తున్న ఆహార పదార్థములను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆర్థోపెడిక్ రామచంద్ర, డాక్టర్ యశస్విని, డాక్టర్ దినేష్బాబు, డాక్టర్ హుజేరా, హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, సిఒ జ్యోతి, ఎఎన్ఎం సుభాషిని, అంగన్వాడీ టీచర్లు మల్లిక, సుజాత, సుబ్బలక్ష్మమ్మ, విజయ, సులోచన, శ్యామల పాల్గొన్నారు.



పౌష్టికాహారం స్టాల్ వద్ద వైద్యులు, అంగన్వాడీలు

సింహాద్రిపురం : గతంలో ఎన్నడూ లేనివిధంగా వైద్య రంగానికి సిఎం వైఎస్ జగన్మోహన రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్నపూస రామ్మోహన్రెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టడం ఎంతో అభినందనీయమన్నారు. వైద్యాధికారి హుస్సేన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగలింగాచారి, ఎంపిడిఒ కృష్ణమూర్తి, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపిటిసి సభ్యుడు జాఫర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి, జగనన్న గృహ సారథుల కన్వీనర్ బషీర్, మధుసూదన్రెడ్డి, చెన్నకేశవరెడ్డి, సురేష్, మహమ్మద్ పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరికి వైద్యం అందించడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశం అని వైసిపి మున్సిపల్ ఇన్ఛార్జి వైఎస్ మనోహర్రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. నగరిగుట్ట, బాకరాపురం పట్టణ హెల్త్ సెంటర్లలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వైద్యులు, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వార్డ్ కౌన్సిలర్లు, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

- డిసిసి అధ్యక్షులు శ్రీరాములు

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు పాటుపడతానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు తెలిపారు. సోమవారం వేంపల్లెలో ఉన్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డిని శ్రీరాములు కలిశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి శ్రీరాములును శాలువాతో సత్కరించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన కడప జిల్లా అధ్యక్షుడుగా బిసి వర్గానికి చెందిన తనను నియమించినందుకు కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, వేణుగోపాల్, మెయప్పన్, గిడుగు రుద్రరాజు, తులసిరెడ్డి, జంగా గౌతమ్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తులసిరెడ్డి నేతృత్వంలో రాబోవు ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ తరఫున బలమైన అభ్యర్థులను పోటీలో నిలుపుతామన్నారు. గుండ్లకుంట శ్రీరాములును వేంపల్లె మండల కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, ఉత్తన్న, రామకృష్ణ, వేమయ్య, బాలం సుబ్బరాయుడు సత్కరించారు.

అర్హులైన రైతులకు సంక్షేమ పథకాలు

- వ్యవసాయ శాఖ ఎడి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అర్హతగల రైతులకు సంక్షేమ పథకాలు ఇస్తామని ముద్దనూరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం రైతు భరోసా కేంద్రం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ అర్హతగల ప్రతి రైతుకు బుడ్డ శనగలు పంపిణీ చేస్తామన్నారు. ఇకెవైసి వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం రాయితీతో వాటర్ క్యారీయింగ్ పైపులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పైపులకు సంబంధించి పూర్తిస్థాయిలో నిబంధనలు రాలేదని, ఉన్నతాధికారుల నుంచి రాగానే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఒ శివమోహన్రెడ్డి, ఆర్బికె సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడి వెంకటసుబ్బయ్య

యువతలో దేశభక్తిని పెంపొందించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

యువతలో దేశభక్తిని పెంపొందించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర, స్నేహిత అమృత సేవా సమితి ఆధ్వర్యంలో మా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రభుత్వ బాలికల కళాశాల నుండి పూలంగళ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో శ్రీరాజా కళా నిలయం నృత్య చిన్నారి వసుప్రద భరతమాత వేషధారణ ఆకట్టుకుంది. విద్యార్థులంతా దేశభక్తితో మెలగాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య, స్నేహిత అమృత సేవాసమితి అధ్యక్షులు రాజు, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అమ్మవారిని దర్శించుకున్న తహశీల్దార్

ప్రజాశక్తి - వేంపల్లె


దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో గజలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తహశీల్దార్ చంద్రశేఖర్రెడ్డి వాసవి మాతను దర్శిం చుకు న్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తహశీల్దార్ను ఘనంగా సన్మానించారు.



గజలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు

ఇంటింటికీ బాబుతో నేను కార్యక్రమం

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని 8,9,10 కౌన్సిల్ వారుల్లో బాబుతో నేను అనే కార్యక్రమాన్ని స్థానిక టిడిపి నాయకులు నిర్వ హించారు. ఈ సంద ర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ జమ్మల మడుగు పార్టీ ఇన్ఛార్జి భూపేష్రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికి తిరుగుతూ బాబు అక్రమ అరెస్టు గురించి, వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. పథకాల పేరుతో ప్రభుత్వం అభివృద్ధిని అటకెక్కించిందన్నారు. చదువుకున్న యువకులు రాష్ట్రంలో ఉద్యోగాలు లేక రోడ్డున పడ్డారని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో టైలర్ మాబు, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో టిడిపి నాయకులు

ముమ్మరంగా తారు రోడ్డు పనులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని సింహాద్రిపురం నుంచి పులివెందులకు డబల్ రోడ్డు నిర్మాణ పనులు గతంలో చేశారు. అయితే ఇటీవల కాలంలో బలపనూరు సమీపంలో రోడ్డు మరమ్మతులకు గురైంది. ఈ పరిస్థితుల్లో రూ.7 కోట్ల వ్యయంతో బలపనూరు నుంచి సింహాద్రిపురం వరకు రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో రోడ్డు మరమ్మతుకు గురి కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం దెబ్బతిన్న రోడ్లు తొలగించి నూతనంగా వేస్తుండడంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంకాలమ్మ గూడూరు వరకు నిర్మాణం

మొదటి ప్రాధాన్యతగా బలపనూరు నుంచి అంకాలమ్మ గూడూరు వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సింహాద్రిపురం వరకు రోడ్డు పనులు చేపడతాం.

- సోమశేఖర్రెడ్డి, ఎఇఇ, రోడ్లు భవనాల శాఖ



బలపనూరు వద్ద చురుగ్గా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత



హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దగురువలూరు గ్రామంలో రూ.23.94 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్బికె, రూ.20.30 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాలను సోమవారం సర్పంచ్ రాజేష్రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను తెచ్చిందన్నారు. రైతులకు కావలసిన ఎరువులు, మందులు ఆర్బికెలలో అందుబాటులో ఉంటున్నాయన్నారు. నాడు-నేడు నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు రహదారులను పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపిపి లక్ష్మయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ యామిని, డాక్టర్ రాజేష్ కుమార్, పంచాయతీరాజ్ ఎఇ ఈశ్వరయ్య, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మదీనా దస్తగిరి, వైసిపి నాయకులు రామ్మోహన్రెడ్డి, వేమారెడ్డి, ఓబుళరెడ్డి, సుబ్బిరెడ్డి, సివి సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, బలోరో బాషా, పంచాయతీ కార్య దర్శులు శ్రీనువాసులరెడ్డి, ధనేశ్వర్ బాబు, వైద్య సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో ప్రయోజనమని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. పెద్దగురువలూరు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధపెట్టిందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ను ఎమ్మెల్యే తిలకించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, ఎంపిపి టి.లక్షుమయ్య, మండల ప్రత్యేక అధికారి సురేష్రెడ్డి, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ యామిని, వైద్యులు రాజేష్కుమార్, కావ్య మాధురి, ఓబులేసు, గృహ సారధుల మండల కన్వీనర్ రామ్మోహన్రెడ్డి, సర్పంచ్ రాజేష్రెడ్డి, వేమారెడ్డి, ఓబుళరెడ్డి, సుబ్బిరెడ్డి, సివి సుబ్బారెడ్డి, జయసుబ్బారెడ్డి, అల్లాడుపల్లె సర్పంచ్ కిశోర్కుమార్రెడ్డి, వైద్య సిబ్బంది రాఘవయ్య, భాస్కర్, నారాయణరెడ్డి, రమేష్, పంచాయతీ కార్యదర్శి ధనేశ్వర్బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరి సహకారం తప్పనిసరని మండల ప్రత్యేక అధికారి నాగ లింగాచార్యులు పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలనకు మండలస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక నష్టాలు కలుగుతాయన్నారు. చదువుకునే వయసులో వివాహాలు చేయడం సరి కాదన్నారు. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలు చేస్తున్న తల్లిదండ్రులకు మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కలిసి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి, మహిళా పోలీసులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. **చాపాడు :** చాపాడు మండలాన్ని బాల్య వివాహాల రహితంగా తీర్చి దిద్దుటకు మహిళా సంఘాల సభ్యులు కృషి చేయాలని ఇందిరా క్రాంతి పథకం ఎపిఎం వెంకటరమణ, అంగన్వాడీ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ కోరారు. సోమవారం చాపాడు, పల్లవోలులో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముద్దనూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ బోనం సరళ, ఎంపిటిసి జెడి ఇంద్రాణి అన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సరళ, కార్యదర్శి లక్ష్మి నరసింహులు ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై సచివాలయం సిబ్బందికి, వాలంటీర్లకు సమావేశం నిర్వహించారు. అనం తరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వాలం టీర్లు పాల్గొన్నారు. మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఎపిఎం ఇబ్రహీం, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉమారాణి, డ్వాక్రా సం ఘాల మహిళలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **ఖాజీపేట :** బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపేట సెక్టర్ పరిధిలో బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కలిపిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపిపి అబుబకర్ సిద్దిక్, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు రాఘవరెడ్డి, కొత్తపేట వైసిపి నాయకులు గోపాల్రెడ్డి, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **చక్రాయపేట :** బాల్య వివాహాల రాష్ట్రంగా ఎపిని చూడాలని డిఆర్డిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. స్థానిక ఆంజనేయపురంలో బాల్యవివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ కోసం మండల వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని లైవ్ జూమ్ వీడియో కాన్ఫరెన్స్లో సెర్ప్ సిఇఒ ఇంతియాజ్ అహమద్ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు నాగేశ్వరరావు, సుహాసిని, రాజన్న, చక్రాయపేట, చిలేకంపల్లె డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో ఎలాంటి విభేదాల్లేవు : 'కొనిరెడ్డి'



మాట్లాడుతున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్రెడ్డికి తనకు ఎలాంటి విభేదాల్లేవని, అందరం కలిసి పార్టీ కోసం పని చేస్తామని జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొత్తపల్లి పంచాయతీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓ అధికారి చేసిన తప్పిదాల వల్లే ఎమ్మెల్యేకు, తనకు చిన్నచిన్న మనస్పర్ధలు వచ్చాయన్నారు. ఎమ్మెల్యేతో కలిసి పని చేస్తామన్నారు. ఎమ్మెల్యే గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే తాను కాలేజీ రోజుల్లో నుంచి సయోధ్యతో కలిసి పని చేశామన్నారు. కొత్తపల్లె పంచాయతీ నుంచి ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్రెడ్డికి అత్యధిక మెజార్టీ తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యేతో కలిసి కొత్తపల్లె పం చాయతీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు తనను బాధించాయన్నారు. అవి పునరావృతం కాకుండా సరి చేసుకుం టామని శివచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జెపిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్, వైసిపి జిల్లా ప్రచార కన్వీనం కల్లూరు నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

గణితంలో పట్టు సాధించాలి

ప్రజాశక్తి - చాపాడు

సాఫ్ట్ వేర్ ఉద్యోగాలను ఆశించే వారు గణితంలో పట్టు సాధించాలని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఒఎస్డి ప్రిన్సిపల్ పి.గురుమూర్తి రెడ్డి సూచించారు. స్థానిక సిబిఐటి కళాశాలలో సోమవారం ఇన్నోవేషన్ డే నిర్వహించారు. డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) కింద ఇన్నోవేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పి. గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటించాలన్నారు. సాఫ్ట్వేర్ ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఓవర్ కాన్ఫిడెన్సు పెట్టుకోవద్దన్నారు. ఏదైనా సాధించాలంటే మనకు సాధ్యం కానిది లేదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గురుమూర్తిరెడ్డి

80 శాతం విత్తన బుడ్డ శనగల పంపిణీ

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలో 80 శాతం బుడ్డ శనగల పంపిణీ కార్యక్రమం పూర్తి చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎవి రామాంజల్ రెడ్డి తెలిపారు. మండలంలో 3,980 క్వింటాళ్ల శనగలు అవసరమని రైతులు నమోదు చేసుకున్నారు. ఇందులో ఇప్పటికే 36 క్వింటాళ్ల శనగలు పంపిణీ చేశామ, మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తామన్నారు. సోమవారం రేగడిపల్లిలో మండల ఉపాధ్యక్షుడు కెవై చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ శృతి చేతులమీదుగా 6 క్వింటాళ్ల బుడ్డ శనగలు పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం సిద్ధం చేస్తునట్లు చంద్రశేఖర్రెడ్డి తెలిపారు.



శనగల పంపిణీలో అధికారులు

విశిష్ట రకంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ఖాజీపేట

వేరుశనగలో విశిష్ట రకం (టిసిజిఎస్ 1694)తో అధిక దిగుబడులు సాధించవచ్చునని కెవికె సమన్వయకర్త వీరయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుడ మలదిన్నె గ్రామంలో రైతు శివారెడ్డి పొలంలో క్షేత్ర దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆకుమచ్చ తెగులును తట్టుకొని కే6 రకానికి మంచి ప్రత్యా మ్నాయమని తెలిపారు. నూరు నుంచి 105 రోజుల్లో 8, 10 క్వింటల దిగు బడి పొందవచ్చునని సూచించారు. అనంతరం రైతులకు తగిన సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శిల్పకళ, ఎఒ నాగార్చన పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు

పిఆర్ ఇంజినీర్కు ఎమ్మెల్సీ ఫిర్యాదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వేంపల్లి మండలం వేంపల్లి-తూపల్లి మధ్యనున్న పాపాఘ్ని నది మీద వంతెన నిర్మాణాన్ని, నిర్మాణ సంస్థ ఐదేళ్లయినా పూర్తి చేయలేదని, వెంటనే పని పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్పై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలు నాయక్కు శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయవాడలో ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్కు కొంత సమయం ఇచ్చామని , అప్పటిలోగా పూర్తి చేయకుంటే బ్లాక్ లిస్ట్లో పెడతామని అన్నట్లు రాంగోపాల్రెడ్డి అన్నారు. త్వరగా పూర్తి కాకుంటే టిడిపి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో వంతెన పని పూర్తి చేస్తామన్నారు.

సచివాలయ గృహ సారధులతో సమావేశం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక వైసిపి కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయ గృహ సారధులతో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా వైసిపి జెసిఎస్ కో-ఆర్డినేటర్, జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకులు కల్లూరు నాగేంద్ర, జడ్పిటిసి బాలయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్లు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బివి రామ్ను సన్మానిస్తున్న తులసిరెడ్డి

విశాఖ రాజధానిని కోరుకోవడం లేదు

- తెలుగుశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బివి రామ్

ప్రజాశక్తి - వేంపల్లె

ఉత్తరాంధ్ర ప్ర జలు ఎవరూ కూడా విశాఖ పట్నంను రాజ ధానిగా కోరుకోవడం లేదని తెలుగు శక్తి పార్టీ రాష్ట్ర అధ్య క్షులు బివి రామ్ అన్నారు. సోమ వారం వేంపల్లెలో ఉన్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. అనంతరం బివి రామ్ విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్పై దండయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. నిజంగా సిఎంకు విశాఖపై ప్రేమ ఉంటే విశాఖ నుండి జగన్మోహన్రెడ్డి పోటీ చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్లో 30 వేల మంది మహిళలు అదృశ్యమైతే వాటిపై చర్యలు లేవన్నారు. ఉత్తరాంధ్ర కంటే ముందు రాయలసీమను అభివృద్ధి చేయాలని కోరారు. సిఎం సొంత నియోజకవర్గంలోనే ప్రజలు జగన్ను ఛీ కొడుతున్నారన్నారు. తులసిరెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరుతో రాజధానిని అమరావతి నుండి విశాఖకు తరలించాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించడం చారిత్రాత్మక తప్పిదమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం శర్మ, ఉత్తన్న, అమర్నాథ్రెడ్డి పాల్గొన్నారు.

దళిత మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి ప్రభుత్వంలో దళిత మహిళలకు రక్షణలేదని టిడిపి ఎస్సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రాజు అనంతపురం నుంచి మంగళగిరి వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్ర ఆదివారం నియోజకవర్గంలోని లింగాల మండలం పార్నపల్లె నుండి పులివెందులకు చేరుకుంది. సోమవారం టిడిపి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం నుండి మంగళగిరి వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. దళితులు ఏకతాటిపై నిలబడి జగన్మోహన్రెడ్డిని ఇంటికి పంపించాలన్నారు. చంద్రబాబుకు జైలులో ఏమైనా జరిగితే వైఎస్ జగన్ ఇంటి పునాదులతో సహా టిడిపి కార్యకర్తలు పేకలిస్తారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. అనంతరం టిడిపి కార్యాలయం నుండి బైపాస్ రోడ్డు మీదుగా రాజు చేపట్టిన సైకిల్ యాత్రకు సంఘీభావంగా తొండూరు మండలం మల్యాల వరకు నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. కార్యక్రమంలో జోగిరెడ్డి, రఘునాథ్రెడ్డి, అన్నారెడ్డి ప్రసాద్రెడ్డి, వెంకట్రామిరెడ్డి, తూగుట్ల రాఘవరెడ్డి, విజయ్కుమార్రెడ్డి, మైసూరారెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు 'బాబు కోసం నేను సైతం' అంటూ అనంతపురం నుంచి అమరావతి వరకు చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం ముద్దనూరు చేరింది. సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్రెడ్డి, కడప జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లేష్ ఘన స్వాగతం పలికారు. కార్యక్రంలో మండలాధ్యక్షులు చింతా శివరామిరెడ్డి, టౌన్ అధ్యక్షులు రంగారెడ్డి , నియోజవర్గం ఎస్సీ సెల్ కార్యవర్గం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



సిఐని కలిసిన సిపిఎం, డివైఎఫ్ఐ నాయకులు

బాధితులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు అర్బన్ సిఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కరుణాకర్ను పట్టణంలోని పలు ప్రజా ఉద్యమ సంఘాల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలి శారు. సిపిఎం, చేనేత, డివైఎఫ్ఐ, ఎమ్మార్పిఎస్, అనుబంధ సంఘాల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పిఎస్ ఉద్యమ నాయకులు పలు సమస్యలను సిఐ దృష్టికి తీసుకెళ్లారు. పేదలు, దళితులు, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారంలో తగురీతిలో స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వీరణాల శివనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు, నియోజకవర్గ ఇన్ఛార్జి వై. చిన్నయ్య, ఎంఎస్పి జిల్లా నాయకులు సుబ్బగాళ్ళ నరసింహులు, బొంతల ఓబులేసు, ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు రవికుమార్, ప్రసాద్, రామాంజనేయులు, పుల్లయ్య శివరామ్, మహేంద్ర, ఎంఇఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు బాల ఓబయ్య ఉన్నారు.

సివి సుబ్బారెడ్డి నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణం చవ్వా సుభాకర్రెడ్డి కాలనీలోని చవ్వా వెంకటసుబ్బారెడ్డి (90) సోమవారం మరణించడంతో ఆయన భార్య వేదామణి, కుమారుడు విజయశేఖర్రెడ్డి, కుమార్తె ప్రమీలమ్మ, కోడళ్లు సులోచన, సునీత, అల్లుడు వైయస్ మనోహర్రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో ఆయన టెక్నీషియన్ హరీష్తో కలిసి సుబ్బారెడ్డి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. కార్యక్రమంలో ఆ సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులుగా వెంకటేష్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కాంగ్రెస్ పార్టీ పులివెందుల మండల ఉపాధ్యక్షులుగా ముద్దంగుల వెంకటేష్ నియమితులయ్యారు. ఆ మేరకు సోమవారం ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్ఛార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి ఉత్త ర్వులను వెంకటేష్కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాన న్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజ కవర్గంలో బలంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పాటుపడతానని తెలిపార. పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు ఇన్ఛార్జి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ పదవి తనకు ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్, జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు నూరు బాషా, వేముల మండలం అధ్యక్షులు మహేంద్ర, మైనార్టీ అధ్యక్షులు బాషా పాల్గొన్నారు.



వెంకటేష్కు నియామక పత్రాన్ని అందిస్తున్న వేలూరు